సాక్షి పెద్దపల్లి

శనివారం, 9, మార్చి, 2024


కమాన్‌పూర్ : మహిళలకు సన్మానం


ఎలిగేడు : వేడుకల్లో ఎమ్మెల్యే విజయరమణారావు, మహిళలు


జ్యోతినగర్: కేక్ కట్ చేస్తున్న మహిళలు

మహిళల సంబురం

జ్యోతినగర్(రామగుండం)/కమాన్‌పూర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా మహిళలు సంబురాలు జరుపుకున్నారు. వివిధ స్వచ్ఛంద, యువజన, మహిళా సంఘాల ఆధ్వర్యంలో శ్రామికులు, కార్మికులు, కళాకారులతోపాటు వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన మహిళా ప్రతినిధులను ఘనంగా సన్మానించారు.

న్యూస్‌రీల్

లక్ష్యం సాధించాలి


మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి(మంథని): నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు సూచించారు. శుక్రవారం ఆర్జీ–3జీఎం కార్యాలయం గనుల ఏజెంట్లు, మేనేజర్లు, అధికారులతో సమీక్షించారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి తీయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. ఏరియా ఇంజినీర్ ఏలీషా, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ప్రాజెక్టు అధికారులు రాధాకృష్ణ, రమేశ్, ఏరియా సేఫ్టీ అధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

లోకో పైలట్ల ఆందోళన


ఆందోళన చేస్తున్న లోకోపైలట్లు

రామగుండం: జమ్ముకశ్మీర్‌లో లోకోపైలట్, స్టేషన్ మాస్టర్, గార్డులను ఉద్యోగం నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆందోళన చేశారు. ఏఐఎల్‌ఆర్‌ఎస్‌ఏ కార్యదర్శి రవి మాట్లాడుతూ రైల్వేలో 14/11 రూల్ ఎత్తివేయాలన్నారు. ఈ నిబంధన ద్వారా రైల్వే ఉద్యోగికి ఎనోటీసు ఇవ్వకుండా, విచారణ చేపట్టకుండానే శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగిస్తారని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. అనంతరం ఉన్నతాధికారులకు వినతిపత్రం పంపించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎంకే పాల్, సౌరవ్‌కుమార్, అజయ్, రాజేందర్ పాల్గొన్నారు.

11న అప్రెంటిస్ మేళా

పెద్దపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 11న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ నర్సింహాచారి తెలిపారు. హైదరాబాద్, కరీంనగర్‌కు చెందిన పలు కంపెనీలు హాజరవుతాయన్నారు. ఐటీఐ పాసైన, అప్రెంటీస్‌షిప్‌రాని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకుని సోమవారం (ఈనెల 11న) ఉదయం 9గంటలకు సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఫొటోతో హాజరు కావాలని ఆయన సూచించారు.

నేడు జాబ్‌మేళా

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని నందనగార్డెన్(కూనారం రోడ్డు)లో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే విజయరమణారావు శుక్రవారం తెలిపారు. తెలంగాణ సొసైటీ ఫర్ ట్రెయినింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తారన్నారు. 65కుపైగా కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన నిరుద్యోగ విద్యావంతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.


వార్షిక ఉత్పత్తి లక్ష్యాలపై దృష్టి


క్వారీ పరిశీలిస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్

గోదావరిఖని: మరో 23రోజులే మిగిలి ఉన్నక్రమంలో రక్షణతో కూడిన వార్షిక బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారించాలని సంస్థ డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్‌వీకే శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3ను ఆయన సందర్శించారు. వ్యూపాయింట్ ద్వారా క్వారీ పరిశీలించారు. ఉత్పత్తి మెరుగుదలకు చేపట్టాల్సిన చర్యలపై ఏరియా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆర్థిక సంవత్సరం సమీపిస్తున్న క్రమంలో వార్షిక లక్ష్యాల సాధనకు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా చూడాలన్నారు. దీనికిముందు జీఎం కార్యాలయంలో ఆర్జీ–2 జీఎం, ఇతర అధికారులతో సమీక్షించారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు, వాటిని సాధించడానికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. డైరెక్టర్ వెంట ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, ఎస్‌వోటూ జీఎం రవీందర్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుల్తానాబాద్(పెద్దపల్లి): మున్సిపల్ పరిధిలోని పూసాల శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దేవాదాయ, ధర్మాదాయ శాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు తెలిపారు. ఐదుగురు సభ్యులతో కూడిన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కమిటీతోపాటు వ్యవస్థాపక కుటుంబ సభ్యులు 20రోజుల్లోగా సహాయ కమిషనర్, దేవాదాయ, ధర్మాదాయశాఖ, కరీంనగర్‌కు దరఖాస్తు పంపించాలని ఆయన కోరారు.


విద్యుత్ కాంతుల్లో వేములవాడ రాజన్న ఆలయం

పరమేశ్వరా.. పాహిమాం

- వేములవాడలో వైభవంగా మహాశివరాత్రి
- దర్శనానికి బారులుతీరిన జనం
- 2 లక్షల మంది భక్తుల రాక
- ఆలయ ఆవరణలోనే జాగారం
- గోదావరి నదిలో భక్తుల పుణ్యస్నానాలు

వేములవాడ: దక్షిణకాశీ.. రాజన్న సన్నిధి భక్తుల రాకతో పులకించింది. మహాశివరాత్రి వేడుకలు వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్ధరాత్రి సమయంలో మొదలైన లింగోద్భవం ఆధ్యాత్మిక జరిలో కొనసాగింది. అంతకుముందు మహాలింగార్చన కనులపండువగా నిర్వహించారు. శివమాలధారులతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది. నిరంతరం లఘు దర్శనాలు కొనసాగాయి. శనివారం అర్ధరాత్రి వరకు ఆలయాన్ని తెరిచే ఉంచుతున్నట్లు ఈవో కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఏర్పాట్లను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ కలెక్టర్ గౌతమి, ఏఎస్పీ చంద్రయ్య, ట్రెయినీ ఎస్పీ రాహుల్‌రెడ్డి, ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ మహేశ్ పరిశీలించారు.

రాజన్న సేవలో ప్రముఖులు

రాజన్నను హైకోర్టు జడ్జి కె.సురేందర్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న జడ్జి దంపతులకు స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ, ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో హరికిషన్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అద్దాల మంటపంలో స్వామి వారి ప్రసాదాలు అందించి, సత్కరించారు. జిల్లా జడ్జి ప్రేమలత, సబ్‌జడ్జి సట్టు రవీందర్, జూనియర్ సివిల్ జడ్జీలు ప్రవీణ్, జ్యోతిర్మయి, సుజన తదితరులు రాజన్నను దర్శించుకున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి దంపతులు, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ దర్శించుకున్నారు.

వైభవంగా సామూహిక మహాలింగార్చన

సామూహిక మహాలింగార్చన వైభవంగా జరిగింది. స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ నేతృత్వంలో అర్చక బృందం మహాలింగార్చన కార్యక్రమాన్ని రెండు గంటల పాటు నిర్వహించారు. మట్టితో చేసిన 366 మృత్తికలు, పిండితో చేసిన 366 జ్యోతులను లింగాకారంలో పేర్చి అభిషేకం చేశారు.

ఆకట్టుకున్న పేరిణి శివతాండవం

రాష్ట్ర భాష, సాంస్కృతికశాఖ జాయింట్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ సారథ్యంలో గుడిచెరువులోని శివార్చన వేదికపై నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దాదాపు 500 మందికిపైగా కళాకారులు వివిధ కళా ప్రదర్శనలు ఇచ్చారు. పేరిణి శివతాండవం, ఒగ్గుడోలు, ఒగ్గుకథ, పోచమ్మబోనాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

భక్తులతో పోటెత్తిన శివాలయాలు

పెద్దపల్లిరూరల్/గోదావరిఖనిటౌన్: మహాశివరాత్రి సందర్భంగా పెద్దపల్లితోపాటు గోదావరిఖని, మంథని సమీప గోదావరి నదిలో వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి ఉపవాస దీక్ష చేపట్టారు.


వేములవాడ రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ


పెద్దపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు


మంథనిలో పూజలు చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు


ఓదెలలో మల్లికార్జునస్వామి ఊరేగింపు


మొక్కులు చెల్లిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్


పెద్దపల్లిలో శివకల్యాణానికి హాజరైన భక్తులు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


పెద్దపల్లిలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


దీపాలు వెలిగిస్తున్న భక్తులు


పూజలు చేస్తున్న బీఎస్పీ నాయకురాలు దాసరి ఉష


మంథని గోదావరి తీరంలో భక్తుల స్నానాలు

అభయ'హస్తం'ఎవరికో!

- కాంగ్రెస్‌లో టికెట్ల పోటీ
- ప్రవీణ్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, వంశీకృష్ణలకు కేటాయింపు?
- నేడోరేపో కాంగ్రెస్ అధిష్టానం ఖరారు చేస్తుందని ప్రచారం
- పూర్తిస్థాయిలో అభ్యర్థులను ప్రకటించని బీఆర్ఎస్, బీజేపీ
- పార్లమెంటు ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్న పార్టీలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలో పార్లమెంటు పోరుకు అన్ని పార్టీలు సిద్ధమవుతున్నాయి. పాత జిల్లాలో మొత్తం 13 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఇవి నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంటు సెగ్మెంటుల పరిధిలో ఉన్నాయి. ఈసారి ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న వేళ.. అభ్యర్థుల ఎంపికపై అధిష్టానాలు ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీలు రెండు స్థానాల చొప్పున అభ్యర్థులను ప్రకటించగా, కాంగ్రెస్ జాబితాకు పూర్తిస్థాయిలో ఆమోదముద్ర పొందలేదు. కానీ, పార్టీ ముఖ్యనేతల నుంచి అందుతున్న సమాచారం మేరకు.. కరీంనగర్ నుంచి హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, నిజామాబాద్ నుంచి తాటిపర్తి జీవన్‌రెడ్డి, పెద్దపల్లి నుంచి గడ్డం వంశీకృష్ణ పేర్లను అధిష్టానం పరిశీలిస్తోందని జోరుగా ప్రచారం సాగుతోంది. శుక్రవారం సాయంత్రం వెలువడిన కాంగ్రెస్ అధికారిక జాబితాలో ఉమ్మడి జిల్లా పార్లమెంటు స్థానాలకు ఇంకా అభ్యర్థులకు చోటు దక్కలేదు. దీంతో ఈ మూడుస్థానాల్లో టికెట్ ఆశిస్తున్నవారిలో ఉత్కంఠ రెట్టింపైంది.

హస్తంలో గట్టిపోటీ

- గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ బుజ్జగింపులతో హుస్నాబాద్ అసెంబ్లీ బరి నుంచి అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తప్పుకున్నారు. దీంతో ఆయనకు తగినప్రాధాన్యం కల్పిస్తామని అప్పట్లో అధిష్టానం హామీ ఇచ్చింది. ఈ మేరకు ఆయనకు కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఇవ్వనుందని ప్రవీణ్‌రెడ్డి అనుచరులు ధీమాగా ఉన్నారు. అదే సమయంలో 2009లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన వెలిచాల రాజేందర్‌రావు కూడా ఎంపీ టికెట్ బరిలో ఉన్నారు. టికెట్ తనకే వస్తుందని ఈయన బలంగా చెబుతున్నారు.


జీవన్‌రెడ్డి


ప్రవీణ్‌రెడ్డి


గడ్డం వంశీకృష్ణ

- ఇక పెద్దపల్లి టికెట్‌కు గట్టి పోటీ ఉంది. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వెంకటేశ్ నేత తనకు ఎంపీ టికెట్ కావాలని పట్టుబడుతున్నారు. అదే సమయంలో చెన్నూరు ఎమ్మెల్యే, పెద్దపల్లి మాజీ ఎంపీ వివేకానంద కుమారుడు గడ్డం వంశీకృష్ణ కూడా ఇదే సీటుపై కన్నేశారు. తమ కుటుంబానికి ఇచ్చిన హామీ మేరకు అధిష్టానం తప్పకుండా వంశీకృష్ణకు న్యాయం చేస్తుందని ఆయన అనుచరులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వంశీకృష్ణ విషయంలో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లా నేతలు కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారన్న ప్రచారం ఉంది. వీరితోపాటు మాజీ ఎంపీ సుగుణకుమారి, ఊట్ల వరప్రసాద్, ఆసంపల్లి శ్రీనివాస్, పెర్క శ్యాం కూడా ఆశావహుల జాబితాలో ఉన్నారు.
- నిజామాబాద్ పార్లమెంటు కిందకు ఉమ్మడి జిల్లాలో జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాలు వస్తాయి. ఇక్కడ నుంచి ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి పోటీ చేయనున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో ఓడిన ఆయన ఈసారి నిజామాబాద్‌లో గెలిచి తీరాలన్న పట్టుదలతో ఉన్నారు.

ముందున్న బీఆర్ఎస్, బీజేపీ..!

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, బీఆర్ఎస్ ముందున్నాయి. ఇప్పటికే కరీంనగర్ నుంచి సిట్టింగ్ బండి సంజయ్, నిజామాబాద్ సిట్టింగ్ ధర్మపురి అర్వింద్ పోటీ చేయనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అర్వింద్(కోరుట్ల), సంజయ్(కరీంనగర్)లు ఉమ్మడి జిల్లా నుంచి బీఆర్ఎస్ అభ్యర్థుల చేతిలో ఓడిపోయారు. ఇద్దరూ రాష్ట్రంలో ఫైర్ బ్రాండ్ నేతలుగా గుర్తింపు పొందినవారే. వీరిద్దరూ ఇప్పటికే ప్రచారం ప్రారంభించారు. పెద్దపల్లి పార్లమెంటుకు బీజేపీ ఇంకా ఎవరినీ ప్రకటించలేదు. గత పార్లమెంటు ఎన్నికల్లో ఇక్కడ నుంచి బీజేపీ అభ్యర్థిగా ఎస్.కుమార్ పోటీచేసిన విషయం తెలిసిందే. మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ ఎస్సీ రాష్ట్ర మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి, ఆలయ ఫౌండేషన్ సీఈవో మిట్టపల్లి రాజేందర్‌కుమార్, విశ్వహిందూపరిషత్ నాయకుడు అయోధ్య రవి ఎంపీ టికెట్ ఆశిస్తున్నారు.

- ఇక కరీంనగర్, పెద్దపల్లి స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించింది. మాజీ ఎంపీ, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ కరీంనగర్ నుంచి బరిలో దిగుతున్నారు. ఇక మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పెద్దపల్లి నుంచి బరిలో దూకుతున్నారు. నిజామాబాద్ ఎంపీ స్థానానికి ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని పరాజయం చవిచూసిన కారు పార్టీ పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటాలన్న సంకల్పంతో ఉంది. ఇప్పటికే బండి సంజయ్– వినోద్‌కుమార్‌ల మధ్య రాజకీయ ఆరోపణలు మొదలైన సంగతి తెలిసిందే. ప్రధాన పార్టీలు పూర్తిస్థాయిలో అభ్యర్థులను ప్రకటించగానే వేసవి రాజకీయం మరింత వేడెక్కనుంది.



మహిళల హక్కులు కాలరాస్తున్న బీజేపీ

- పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కె.జ్యోతి


నిరసన ప్రదర్శనలో మహిళలు

గోదావరిఖని: మహిళల హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.జ్యోతి విమర్శించారు. శుక్రవారం స్థానిక లేబర్ కోర్టు సమీపంలోని పైలాన్ చౌరస్తా వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రకటించి 114ఏళ్లు గడుస్తున్నా మహిళల శ్రమదోపిడీ ఆగడం లేదన్నారు. పని స్థలాల్లో మెరుగైన పరిస్థితులు, కనీస సౌకర్యాలు, సమావేశమయ్యే హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. పురుషులతో సమానంగా యూనియన్‌లో భాగస్వామ్యం కల్పించాలని, ఓటుహక్కు కావాలని నినదిస్తూ మహిళా కార్మికులు మహత్తర పోరాటాలు చేశారని గుర్తుచేశారు. అంతర్జాతీయ మహిళా దినం అంటే సంబురాలు, ఉత్సవాలు జరుపుకోవడం కాదని, ముగ్గుల పోటీలు జరుపుకోవడం అంతకంటే కాదని, మార్చి 8 అంటే మహిళల హక్కుల రక్షణ కోసం పోరాటం చేయడమని ఆమె వివరించారు. నిత్యం మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, వరకట్న హత్యలు, హింసలకు వ్య తిరేకంగా ఉద్యమించడమని పేర్కొన్నారు. పేద మహిళలకు విద్య, వైద్యం, నిలువ నీడ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు, కార్యక్రమంలో మంగ, కల్యాణి, శంకరమ్మ, పద్మ, ఐ.కృష్ణ, నరేశ్, బి. అశోక్, ఎం.దుర్గయ్య, బిచ్చయ్య, రవికుమార్, బతుకుల రాజన్న, అబెద్నెగో తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న పికప్ పట్టివేత

- ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని పదిర శివారులోని మానేరువాగు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న పికప్ వాహనాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. మండలంలోని నారాయణపూర్‌కు చెందిన బుర్క సాయిరాజ్ అనే డ్రైవర్ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో రాగట్లపల్లి వద్ద అడ్డుకున్నారు. అనుమతిపత్రాలు లేకపోవడంతో వాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పదిరకు చెందిన వాహన యజమాని గండికోట కనకయ్య, డ్రైవర్ సాయిరాజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

డెంగీతో ఒకరి మృతి

కోనరావుపేట(వేములవాడ): ధర్మారం గ్రామానికి చెందిన పిట్టల రాములు(50) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. నాలుగు రోజుల క్రితం జ్వరం రాగా సిరిసిల్లలోని ఓ ఆస్పత్రికి తరలించారు. రక్తపరీక్షలు చేసిన వైద్యులు డెంగీగా గుర్తించారు. హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తుండగా శుక్రవారం వేకువజామున మృతి చెందాడు. మృతునికి భార్య రేణుక, ఒక కూతురు ఇద్దరు కుమారులు ఉన్నారు.

గడువు పొడిగింపు

పెద్దపల్లిరూరల్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుల గడువును ఈనెల 12 వరకు పొడిగించినట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల జిల్లాలకు చెందిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 0878–2268686 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

పుస్తెలతాడు చోరీ

వేములవాడరూరల్: పట్టపగలు బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు ఆగంతకులు ఓ మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు దొంగిలించి పరారయ్యారు. ఈ ఘటన వేములవాడరూరల్ మండలం వట్టెంలలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన మంద వరవ్వ తన ఇంటి వద్ద ఉండగా శుక్రవారం మధ్యాహ్నం ఇద్దరు వచ్చి.. ఆమె మెడలో నుంచి పుస్తెలతాడు దొంగిలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై మారుతి తెలిపారు.

వెంటాడుతున్న ఈవ్‌టీజింగ్

- విద్యా సంస్థల ప్రాంతాల్లో పోకిరీల ఆగడాలు
- పోలీసు నిఘా పెంచితేనే భరోసా
- కళాశాల విద్యార్థినుల అభిప్రాయాలు



జ్యోతినగర్(రామగుండం): 'ఈవ్ టీజింగ్ అంటేనే అమ్మాయిలు భయపడుతున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సమాజం ఎంతో అభివృద్ధి చెందుతున్నా.. బాలికలు, విద్యార్థినులు, యువతులు, మహిళలపై ఇంకా అఘాయిత్యాలు, లైంగిక వేధింపులు చోటుచేసుకోవడం శోచనీయం' అంటున్నారు ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని ట్రినిటీ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

ర్యాగింగ్ నేరం



ర్యాగింగ్ అనేది గుర్తించదగిన నేరం. ఇది మనదేశంలో చాలామంది తెలివైన విద్యార్థుల మరణాలు, ఆత్మహత్యలకు కారణమైంది. ర్యాగింగ్‌పై ఒకరు ఫిర్యాదు చేస్తే సంబంధిత విభాగాల అధిపతులు వెంటనే స్పందించాలి. ఆలస్యం చేస్తే మరణాలకు దారితీస్తుంది. ర్యాగింగ్ అనేది సీనియర్ విద్యార్థులు జూనియర్‌లతో హానిచేయని పరస్పర చర్య అనే సాకు సమర్థనీయం కాదు.

– శివాణి, బీకాం, తృతీయ సంవత్సరం

కమిటీలు ఏర్పాటు చేయాలి



విద్యార్థినులు చదువుకునే ప్రతీకళాశాలలో ప్రత్యేకంగా యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలి. డిపార్ట్‌మెంట్లు, క్యాంటీన్ తదితర వాటితో సహా ఇనిస్టిట్యూట్ క్యాంపస్, హాస్టళ్లు, మెస్‌లు, ప్లేగ్రౌండ్‌లు, రవాణా వాహనాలపై ర్యాగింగ్ నిషేధం అని ప్రతీఒక్కరికి తెలిసేలా ప్రచార పోస్టర్లు అంటించాలి.

–శ్రీసాయిప్రసన్న, బీకాం

అవగాహన కల్పించాలి



కళాశాలల్లో నెలకు ఒకసారైనా పోలీసు అధికారులతో ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమాలు, షీటీంలతో సదస్సులు ఏర్పాటు చేయాలి. ప్రతీ స్టూడెంట్ ఫోన్‌లో షీటీం ఫోనంబర్‌తోపాటు సంబంధిత కళాశాల ప్రాంతంలోని పోలీసు అధికారుల ఫోన్ నంబర్లు తప్పక కాంటాక్టు జాబితాలో ఉంచుకోవాలి.

– నందిని, బీఎస్సీ

పెట్రోలింగ్ పెంచాలి



ఉన్నత విద్య అందిస్తున్న కళాశాలలు ఉన్న ప్రాంతంలోని బస్‌స్టేషన్లు, రోడ్డుపై కళాశాల ప్రారంభం, విడుదల సమయంలో పోలీసులు పెట్రోలింగ్ పెంచాలి. రోడ్డుపై ఎవరైనా అసభ్యకరంగా మాట్లాడినా, వెంటబడుతున్నట్లు గుర్తించినా వెంటనే షీటీంకు సమాచం అందించాలి. భయపడి ఉంటే మనకు మనమే హాని చేసుకున్న వారమవుతాం.

– నితీశ, బీఎస్సీ

పెద్దపల్లిలో అగ్ని ప్రమాదం

- మొబైల్, పూజాసామగ్రి దుకాణాలు దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని జెండా కూడలిలో శుక్రవారం వేకువజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో సూర్య మొబైల్ దుకాణం, ఆర్‌ఆర్ పూజాసామగ్రి షాపు కాలిపోయాయి. వీటిని ఆనుకునే ఉన్న వాచ్ సెంటర్‌కు పాక్షిక నష్టం కలిగింది. వేకువ జామున మొబైల్‌షాపు నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు.. అగ్నిమాపక, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అధికార యంత్రాంగం పెద్దపల్లితోపాటు మంథని, గోదావరిఖని ఫైర్ ఇంజిన్లను రప్పించారు. మున్సిపల్ టాంకర్లతో నీటిని తెప్పించి మంటలు అదుపులోకి తెచ్చారు.

తప్పిన ముప్పు..

పోస్టాఫీసు ఎదురుగా గల షాపింగ్ కాంప్లెక్స్‌లో పది దుకాణాలు ఉన్నాయి. అయితే, మొబైల్, పూజాసామగ్రి దుకాణాల్లో మంటలు ఎగిసిపడుతుండడంతో షట్టర్లు తెరిచేందుకు వీలు కాలేదు. దీంతో సీఐ కృష్ణ, ఎస్సైలు సుధాకర్‌రావు, మల్లేశ్ జేసీబీ సాయంతో షట్టర్లను తెరిచి స్థానికుల సాయంతో అగ్నిమాపక సిబ్బంది మహేందర్, సురేశ్‌బాబు, శ్రావణ్‌కుమార్ మంటలను అదుపు చేశారు. దీంతో సమీప దుకాణాలకు ముప్పుతప్పింది. ఇందుకోసం మూడు ఫైరింజిన్లను వినియోగించారు. ఆర్‌ఆర్ పూజాసామగ్రి సెంటర్ యజమానురాలు తిరుమల దాదాపు రూ.10లక్షలు, సూర్య మొబైల్ యజమాని ఎర్రం రమేశ్ సుమారు రూ.20లక్షల మేర నష్టం జరిగిందని సమాచారం ఇమిచ్చారని అగ్నిమాపక శాఖకు చెందిన మహేందర్ తెలిపారు.

యువకుడి దారుణహత్య

- గొడ్డలితో తలపై నరికిన దుండగులు
- డాగ్‌స్క్వాడ్‌తో గాలింపు
- ఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ రఘుచందర్



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రఘుచందర్, సీఐ ఆరీఫ్ అలీఖాన్



సురేశ్ (ఫైల్)

రాయికల్:(జగిత్యాల): జగిత్యాల జిల్లా రాయికల్ మండలం తాట్లవాయి గ్రామానికి చెందిన నాగెల్లి సురేశ్ (24) దారుణహత్యకు గురైన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తాట్లవాయికి చెందిన నాగెల్లి శంకర్–లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు. మొదటి కుమారుడు రమేశ్ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. రెండో కుమారుడు నరేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంతో మృతిచెందాడు. మూడో కుమారుడు సురేశ్. తండ్రి శంకర్‌కు పక్షవాతంతో ఇంటికే పరిమితమయ్యాడు. సురేశ్ తనకున్న రెండెకరాల పొలానికి నీరు పారించేందుకు గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో అతడి కోసం కుటుంబ సభ్యులు వెతికారు. శుక్రవారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా రక్తపు మరకలు ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గాలించగా వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యమైంది. సురేశ్ తలపై బలమైన ఆయుధంతో దాడిచేసి హత్య చేసిన ఆనవాళ్లు ఉండటంతో నిందితుల ఆచూకీ కోసం డాగ్ స్క్వాడ్‌తో గాలింపు చేపట్టారు. సంఘటన స్థలాన్ని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ పరిశీలించి హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు. సురేశ్ హత్య ఉదంతంతో తాట్లవాయి ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అందరితో కలివిడిగా ఉండేవాడని, అతడి హత్య గురించి చర్చించుకుంటున్నారు. మృతుడి సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడు ఎవరెవరితో మాట్లాడాడు, హత్యలో ఎంతమంది పాత్ర ఉందో అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు.

అల్పాహారం..అన్నదానం



అరటిపండ్లు, వాటర్ బాటిళ్లు అందజేత



నాంపల్లి గుట్టపై అల్పాహారం

- భక్తుల సేవలో తరించిన వలంటీర్లు
- ఆకలి తీర్చిన స్వచ్ఛంద సంస్థలు

వేములవాడఅర్బన్: రాజన్న ఆలయంలో అంగరంగ వైభవంగా జరుగుతున్న మహాశివరాత్రి వేడుకలకు హాజరైన భక్తులకు ఆకలి బాధలు ఎదురుపడలేదు. హోటళ్లకు వెళ్లి టిఫిన్ చేయాల్సిన అవసరం పడలేదు. స్థానికంగా ఉన్న పలు స్వచ్ఛంద సంస్థలు భక్తుల ఆకలిని తీర్చేందుకు ముందుకొచ్చాయి. దాతల సహాయంతో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. మహాశివరాత్రి వేడుకలు జరిగే మూడు రోజులపాటు వీరు అన్నదానం చేయనున్నారు. ఆలయ పరిసరాలు, రాజన్నను దర్శించుకునేందుకు క్యూలైన్‌లోని ఉండే భక్తులకు వాటర్‌బాటిళ్లు, అరటిపండ్లను సైతం అందించారు. ఇందుకు ఒకటిన్నర టన్నుల అరటిపండ్లు, పదివేల వాటర్ బాటిళ్లను భక్తులకు అందించినట్లు ట్రస్టు నిర్వాహకులు మధు మహేశ్ తెలిపారు.

నాంపల్లి గుట్టపై అల్పాహారం

వేములవాడ అనుబంధ నాంపల్లి శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయం వద్ద గ్రామానికి చెందిన పల్లెపు రాజేందర్, చిలివేరి శేఖర్, సంగెపు శ్రీనివాస్ వేములవాడ ఈశ్వర్ అల్పాహారం అందించారు.

జనావాసాల్లోకి దుప్పి

- తరిమిన కుక్కలు



కోనరావుపేటకు వచ్చిన దుప్పిని కాపాడుతున్న గ్రామస్తులు

కోనరావుపేట(వేములవాడ): తాగునీటి కోసం వచ్చిన ఓ దుప్పిని కుక్కలు తరమడంతో స్థానిక బస్టాండ్ వరకు వచ్చింది. గాయాలతో ఉన్న దుప్పిని గమనించిన గ్రామస్తులు చికిత్స అందించి అటవీప్రాంతంలో వదిలిపెట్టారు. శివంగాలపల్లి–కోనరావుపేట అటవీ ప్రాంతంలో ఓ దుప్పి తాగు నీటి కోసం బయటకు రాగా కుక్కలు వెంటబడ్డాయి. తప్పించుకుంటూ కోనరావుపేట బస్టాండ్ ప్రాంతంలోకి వచ్చింది. గమనించిన గ్రామస్తులు వెంటనే కాపాడి పశువైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. అనంతరం అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చి ఆయన సమక్షంలో కంచర్ల అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

నా బిడ్డను కాపాడండి

- నిరుపేద తండ్రి వేడుకోలు
- అపస్మారకస్థితిలో నాజియా
- మెదడులో గడ్డకట్టిన రక్తం
- ఆపరేషన్‌కు రూ.15లక్షలు అవసరం
- దాతల సాయం కోసం ఎదురుచూపులు



చికిత్స పొందుతున్న నాజియా

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నిరుపేద కుటుంబం.. అందరూ కష్టపడితేన ఐదేళ్ల నోటిలోకి వెళ్లే దుస్థితి. అలాంటి కుటుంబానికి పెద్ద కష్టం వచ్చింది. ఆ కుటుంబంలోని యువతి మెదడులో రక్తం గడ్డకట్టడంతో మంచానికే పరిమితమైంది. ఆపరేషన్ చేయాలంటే రూ.15లక్షలు అవసరమని వైద్యులు తెలపడంతో ఏం చేయాలో తెలియక ఆ కుటుంబం దిక్కులు చూస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన సయ్యద్ అంజాద్ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అంజాద్ కూతురు నాజియా(20) హఠాత్తుగా అనారోగ్యానికి గురైంది. సిరిసిల్ల ఏరియా ఆస్పత్రిలో వైద్యులకు చూపించగా అన్ని పరీక్షలు చేసిన వైద్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. నాజియా ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమెకు శస్త్ర చికిత్స చేయడానికి సుమారు రూ.15లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. కనీసం ఉండడానికి సొంతిల్లు, గుంటెడు భూమి లేని అంజాద్ దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. దాతలు సాయం చేస్తే తన కూతురు బతుకుతుందని వేడుకుంటున్నాడు.

దాతలు ఫోన్‌పే 95058 91261లో చేయాలని కోరుతున్నాడు.

గుడారాల్లోనే భక్తులు



వేములవాడఅర్బన్: రాజన్న దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు గుడారాలే దిక్కయ్యాయి. వసతిగదులలో చాలా భాగం జాతర విధులకు హాజరైన అధికారులు, సిబ్బందికి కేటాయించడంతో భక్తులకు అందుబాటులో లేకుండా పోయాయి. దీంతో ఎక్కువ శాతం భక్తులు గుడిచెరువు ఖాళీ ప్రాంతంలో గుడారాలు వేసుకుని ఉన్నారు. అక్కడే రాత్రి వేళ జాగరణ చేశారు.

సింగసముద్రంలోకి నీటిని విడుదల చేయాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రైతల వరప్రదాయిని సింగసముద్రంలోకి ఎగువమానేరు నుంచి నీటిని విడుదల చేయాలని సింగసముద్రం కనెక్టింగ్ కాలువల చైర్మన్ ఒగ్గు బాల్‌రాజు, రైతులు కోరారు. సింగసముద్రంలోని నీటి మట్టాన్ని శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం సింగసముద్రం నీటిమట్టం 16 ఫీట్లకు చేరిందని, చివరి ఆయకట్టు భూములు తడవడం కష్టమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగసముద్రం పరిధిలోని రాచర్లబొప్పాపూర్, కోరుట్లపేట, సర్వాయిపల్లి, నారాయణపూర్ ఆయకట్టు భూములకు నీరందాలంటే ఎగువమానేరు నీటిని విడుదల చేయాలని డీఈని కోరినట్లు తెలిపారు. నీటి సంఘం మాజీ చైర్మన్ నేవూరి బాలయ్యగారి గోపాల్‌రెడ్డి, రైతులు రాగుల తిరుపతిరెడ్డి, నీరటీలు మ్యాకల శరవింద్, సత్యనారాయణ, దేవయ్య తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని కొండాపూర్‌లో శుక్రవారం రాత్రి విద్యుదాఘాతంతో రైతు చిగురు యాదగిరి(55) మృతిచెందాడు. గ్రామ శివారులో తనకున్న రెండెకరాల వరి పంటకు నీళ్లు పెట్టేందుకు రాత్రి వెళ్లాడు. పొలం వద్ద బోరుమోటారు పెట్టేందుకు వెళ్లి కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. పొలానికి వెళ్లి మృత్యువాత పడ్డ యాదగిరి మృతదేహం వద్ద భార్యపిల్లల రోదనలు మిన్నంటాయి.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు



ధ్వంసమైన కారు

సుల్తానాబాద్ రూరల్: స్థానిక బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సును కారు ఢీకొంది. గోదావరిఖని నుంచి కరీంనగర్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. స్థానిక బస్టాండ్ లోనికి వెళ్తోంది. ఈక్రమంలోలికి కరీంనగర్ నుంచి పెద్దపల్లి వైపు వస్తున్న కారు బస్సు వెనుకా ఢీకొట్టింది. దీంతో కారు, బస్సు పాక్షికంగా దెబ్బతిన్నాయి. బస్సులోని ప్రయాణికులతోపాటు కారులో ఉన్నవారెవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

నాంపల్లి గుట్టపై భక్తజనం



వేములవాడఅర్బన్: రాజన్న అనుబంధ ఆలయం నాంపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి శుక్రవారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తుల వాహనాలతో గుట్టపై రద్దీ పెరిగింది. భక్తులు లక్ష్మీనరసింహస్వామికి పట్టెనామాలు, కోరమీసాలు సమర్పించారు. అనంతరం భక్తులు నాంపల్లిగుట్టపై ఉన్న కాళీయమర్దనంలోని నాగదేవతకు పాలు పోశారు.

దాహం తీర్చిన జలప్రసాదం



వేములవాడ: రాజన్న మహాజాతరకు వచ్చిన భక్తుల కోసం ఏర్పాటు చేసిన జలప్రసాదం దాహం తీర్చింది. శుక్రవారం భానుడి ప్రతాపం తీవ్రంగా ఉండడంతో భక్తుల దాహార్తితో జలప్రసాదాల వద్దకు క్యూకట్టారు. తల్లులు పసి పిల్లలకు పాలిచ్చేందుకు ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన బేబి ఫీడింగ్ సెంటర్లు ఉపయోగపడ్డాయి.

ఎండిన పంట ... పశువులకు మేత

చందుర్తి(వేములవాడ): భూగర్భ జలాలు అడుగంటడంతో పంటలు ఎండిపోతున్నాయి. ఇన్నాళ్లు కంటికి రెప్పలా కాపాడుకున్న వరిపంట ఎండిపోవడం.. బావులు, బోర్లలో నీళ్లు లేకపోవడంతో చేసేదేమి లేక రైతులు పంటలు వదిలేస్తున్నారు. చందుర్తి మండలం బండపల్లికి చెందిన రైతు కటకం వేణు నాలుగెకరాలలో వరి పంట సాగు చేశాడు. ఎకరాకు రూ.30వేల చొప్పున ఖర్చు చేశాడు. పొలం పొట్ట దశలో ఎండిపోతుండడంతో పంటను కాపాడుకునేందుకు అప్పులు చేసి రెండు బోర్లు వేశాడు. బోర్లలో నుంచి చుక్కనీరు రాక దుమ్ము కనిపించింది. పంటల సాగుకు రూ.1.50లక్షల వరకు అప్పు చేశాడు. వరి పంట ఎండిపోతుండంతో తన గేదెలను, ఆవులను వదిలేశాడు.

బండపల్లిలో ఎండిన పంట పొలంలో పశువులు



ప్రయాణం ఉచితం.. ఆనందభరితం

- తిప్పాపూర్ బస్టాండ్ నుంచి గుడి చెరువు వరకు బస్సు సర్వీసులు
- ఐదు నిమిషాలకో బస్సు



మినీబస్సులో ప్రయాణికులు

వేములవాడఅర్బన్: మహాశివరాత్రి ఉత్సవాలకు దూరప్రాంతాల నుంచి వస్తున్న భక్తుల కోసం ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఉచిత బస్సు సర్వీసులను ఏర్పాటు చేసింది. తిప్పాపూర్ బస్టాండ్ నుంచి రాజన్న గుడి చెరువు వరకు భక్తులను ఉచితంగా చేరవేస్తున్నాయి. గుడి చెరువు కట్టకింద జగిత్యాల బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన బస్‌స్టాప్ నుంచి గుడి చెరువు ఖాళీ స్థలంలోని బస్‌స్టాప్ వరకు రెండు బస్సులను ఏర్పాటు చేశారు. ప్రతీ ఐదు నిమిషాలకో ఉచిత బస్సు నడుస్తుంది. ఈ సేవలు గురువారం నుంచి శనివారం వరకు కొనసాగనున్నాయి. భక్తులను చేరవేసేందుకు 14 మినీ బస్సులను అందుబాటులో ఉంచారు. దూరప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు ఉచిత బస్సు సేవలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఆనందంగా ప్రయాణిస్తున్నారు. ఎండల తీవ్రత పెరగడంతో భక్తులు సైతం ఉచిత బస్సులను వినియోగించుకుంటున్నారు.

సంతోషంగా ఉంది



మాది అదిలాబాద్ జిల్లా. మేము ప్రతీ మహాశివరాత్రికి రాజన్న దర్శనానికి వస్తున్నాం. ఆదిలాబాద్ నుంచి మా భార్యకు ఉచిత బస్సు ప్రయాణం ప్రభుత్వం కల్పించింది. వేములవాడ బస్టాండ్‌కు చేరుకోగానే.. గుడి వరకు అందరికి ఉచిత ప్రయాణం ఉండడం చాలా సంతోషంగా ఉంది.

– రమేశ్ కుటుంబం, ఆదిలాబాద్

ఎండలు పెరిగాయి



ఎండలు మండుతున్నాయి. ఆటోలో రావాలంటే ఇబ్బందిగా ఉండేది. మహాశివరాత్రికి ఏటా కుటుంబంతో వస్తున్నాం. ఉచిత బస్సుతో బస్టాండ్ నుంచి గుడి వరకు వచ్చాం. గతంలో బస్టాండ్ నుంచి గుడి వరకు నడుచుకుంటూ వస్తుండేవాళ్లం. ఇప్పుడు అలాంటి బాధలు తప్పినందుకు సంతోషంగా ఉంది.

– భూమయ్య–లక్ష్మి, మెదక్

అందుబాటులో బస్సులు



వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చే భక్తుల కోసం రాజన్న ఆలయం ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉచిత మినీ బస్సులను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతీ ఐదు నిమిషాలకు ఒక్క బస్సు ఉంటుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకుంటున్నాం.

– మురళీకృష్ణ, వేములవాడ డిపో మేనేజర్